సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

ఆదివారం । 22 । జూన్ । 2025



తగ్గిన చీనీ ధరలు

చీనీ ధరలు బాగా తగ్గాయి. శనివారం అనంతపురం మార్కెట్ యార్డులో టన్ను గరిష్టంగా రూ.25,670, కనిష్టంగా రూ.3 వేల ప్రకారం ధర పలికాయి.



మరోమారు దగా !

వైఎస్సార్‌సీపీ హయాంలో ఉద్యోగాలు పొందిన ఎంటీఎస్ టీచర్లపై కూటమి సర్కార్ కక్షగట్టింది. బదిలీ పేరుతో కర్ణాటక సరిహద్దు స్కూళ్లకు పంపేందుకు సిద్ధమైంది. 8లో

గరిష్టం/కనిష్టం
37.1°/22.5°

జిల్లాలో శనివారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం మేఘావృత అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. గంటకు 8 నుంచి 16 కిలోమీటర్ల వేగంతో గాలి వీచింది.

న్యూస్‌రీల్

పాలిసెట్ కౌన్సెలింగ్ ప్రారంభం



అనంతపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో కౌన్సెలింగ్‌కు హాజరైన విద్యార్థులు

అనంతపురం: పాలిసెట్ కౌన్సెలింగ్ ప్రారంభమైంది. శనివారం ఉమ్మడి జిల్లాలో అనంతపురం, కళ్యాణదుర్గం, తాడిపత్రి, హిందూపురం మహిళా ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో కౌన్సెలింగ్ నిర్వహించారు. తొలిరోజు 1 నుంచి 15 వేల ర్యాంకు వరకు ధ్రువపత్రాల పరిశీలన ప్రక్రియ చేపట్టినట్లు అనంతపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ సి. జయచంద్రా రెడ్డి తెలిపారు. మొత్తం 161 మంది విద్యార్థులు కౌన్సెలింగ్‌కు హాజరైనట్లు పేర్కొన్నారు.

మరిన్ని వివరాలిలా..

28వ తేదీ వరకు సర్టిఫికెట్ల పరిశీలన ఉంటుంది. జూన్ 25 నుంచి జూన్ 30 వరకు(25,26 తేదీల్లో 1-50,000 ర్యాంకు వరకూ, 27,28 తేదీల్లో 50,001-90000, 29,30 తేదీల్లో 90,001-చివరి ర్యాంకు) వెబ్ ఆప్షన్ల ప్రక్రియ జరుగుతుంది. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు హెల్ప్‌లైన్ కేంద్రాలు అందుబాటులో ఉంటాయి. ప్రాసెసింగ్ ఫీజు చెల్లించిన రసీదు, పాలిసెట్ -2025 హాల్ టికెట్, ర్యాంకు కార్డు, పదో తరగతి స్టడీ ఒరిజినల్ సర్టిఫికెట్, 4 నుంచి పదో తరగతి వరకు స్టడీ ధ్రువపత్రాలు, కుల, ఓసీ అభ్యర్థుల ఈడబ్ల్యూఎస్, ఆదాయ ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డుతో పాటు రెండు సెట్ల జిరాక్స్ కాపీలను తీసుకెళ్లాలి. కౌన్సెలింగ్‌లో పాల్గొనే ఓసీ, బీసీలు రూ.700, ఎస్సీ, ఎస్టీలు రూ.250 చొప్పున ఆన్‌లైన్ విధానంలో ప్రాసెసింగ్ ఫీజు చెల్లించాలి. ఫీజు చెల్లించిన రసీదును కౌన్సెలింగ్ కేంద్రంలో అప్పగించాలి. స్టడీ సర్టిఫికెట్ లేని వారు ఏడు సంవత్సరాల రెసిడెన్షియల్ సర్టిఫికెట్, ఈడబ్ల్యూఎస్ వర్తించే వారు అర్హత ధ్రువపత్రం అందజేయాలి.

ర్యాంకుల వారీగా కౌన్సెలింగ్ తేదీలిలా..

తేదీ	ర్యాంకు నుంచి	ర్యాంకు వరకు
22	15,001	32,000
23	32,001	50,000
24	50,001	68,000
25	68,001	86,000
26	86,001	1,04,000
27	1,04,001	1,20,000
28	1,20,001	చివరి ర్యాంకు.

అరుదైన చేప.. చెడు చేస్తుందప్పా




బ్రాహ్మణపల్లి చెరువులో లభ్యమైన దెయ్యం చేప


గుత్తి రూరల్: మండలంలోని బ్రాహ్మణపల్లి చెరువులో అరుదైన దెయ్యం చేప లభ్యమైంది. సాధారణంగా సముద్ర తీర ప్రాంతాలైన కోనసీమ, ఉత్తరాంధ్ర జిల్లాల్లో కనిపించే ఈ చేప శనివారం స్థానిక మత్స్యకారుల వలకు చిక్కింది. అయితే దెయ్యం చేపలు తింటే రోగాల పాలవుతారని, ఈ చేపలు వృద్ధి చెందితే విలువైన చేపల అభివృద్ధికి ఆటంకం కలిగిస్తాయని తెలియడంతో మత్స్యకారులు దాన్ని చెరువు సమీపంలో పూడ్చిపెట్టారు.

రుణదాతల ఒత్తిళ్లు.. వివాహిత ఆత్మహత్యాయత్నం

కనగానపల్లి: రుణదాతల ఒత్తిళ్లు తాళలేక ఓ వివాహిత పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నం చేసింది. ఈ ఘటన శనివారం మండలంలోని తూంచర్లలో చోటుచేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.... తూంచర్ల గ్రామానికి చెందిన రాజ్‌కుమార్ గతంలో అగ్రిగోల్డు ఏజెంట్‌గా పనిచేసేవాడు. ఆ సంస్థ మూతపడటంతో కొంతమంది పాలసీదారులకు అతనే అప్పులు చేసి మరీ డబ్బులు చెల్లించాడు. దీనికితోడు పంటల సాగుకోసం కూడా అప్పులు చేశాడు. వీటిని సకాలంలో తిరిగి చెల్లించకపోవటంతో రుణదాతల నుంచి ఒత్తిళ్లు పెరిగాయి. ఇటీవల కాలంలో నేరుగా ఇంటికి వెళ్లి రాజ్‌కుమార్‌తో పాటు అతని భార్య రాధమ్మను సైతం నిలదీయడం ప్రారంభించారు. శనివారం కూడా కొందరు రుణదాతలు రాజ్‌కుమార్ ఇంటికి వెళ్లి ఆయన భార్యను రుణం తీర్చాలంటూ పట్టుబట్టారు. ఈ ఒత్తిళ్లను భరించలేని రాధమ్మ మనస్తాపానికి గురై సాయంత్రం పురుగుల మందు తాగింది. వెంటనే గుర్తించిన కుటుంబ సభ్యులు ఆమెను అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్య పరిస్థితి విషమంగానే ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

పట్టు తప్పుతోంది!





- రోజురోజుకూ పడిపోతున్న పట్టుగూళ్ల ధరలు
- 'పురం' మార్కెట్‌లో కిలో రూ.600 కూడా పలకని వైనం
- ధరల తగ్గుదలతో ఆందోళనలో రైతులు
- ప్రభుత్వమే ఆదుకోవాలని వేడుకోలు

దిగుబడి పెరిగిందని ఆనందంలో ఉన్న పట్టురైతుకు 'ధరాఘాతం' తగులుతోంది. బైవోల్టిన్ పట్టుగూళ్ల ధర రోజురోజుకూ దిగజారుతుండగా..రైతు పరిస్థితి బేజారవుతోంది. ప్రోత్సాహకం అందించి ఆదుకోవాల్సిన కూటమి సర్కార్ పట్టించుకోకపోవడంతో రైతులు నష్టాలు మూటగట్టుకుంటున్నారు.



హిందూపురం మార్కెట్‌లో అమ్మకానికి వచ్చిన పట్టుగూళ్లు

మడకశిర/హిందూపురం: పట్టుగూళ్ల ధరలు నెలరోజులుగా తగ్గుముఖం పట్టాయి. పట్టుగూళ్ల విక్రయాలకు రాష్ట్రంలోనే పేరెన్నికగన్న హిందూపురం మార్కెట్‌లోనూ ఆశించిన ధర దక్కడం లేదు. నాణ్యత బాగానే ఉన్నప్పటికీ ధర లేకపోవడంతో రైతులు నిరాశ చెందుతున్నారు.

ధరలేక రైతు దిగాలు..

ప్రస్తుతం హిందూపురం మార్కెట్‌కు రోజూ 4 వేల నుంచి 5 వేల క్వింటాళ్ల వరకు బైవోల్టిన్ పట్టుగూళ్లు వస్తున్నాయి. హిందూపురం పరిసర ప్రాంతాల నుంచే కాకుండా వివిధ జిల్లాలతోపాటు కర్ణాటక ప్రాంతం నుంచి కూడా రైతులు పట్టుగూళ్లను ఇక్కడికి తెస్తున్నారు. అయితే నాణ్యమైన గూళ్లు తెచ్చినా రైతులు ఆశించిన ధర మాత్రం పలకడం లేదు. నెల క్రితం కేజీ బైవోల్టిన్ పట్టుగూళ్లు గరిష్టంగా రూ.750 వరకు పలికాయి. కనిష్ట ధర రూ.620 తగ్గకుండా ఉండేది. అయితే కొన్ని రోజుల నుంచి గరిష్ట ధర రూ.600 దాటడం లేదు. కనిష్ట ధర రూ.500 లోపే ఉంటోంది. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఒక్కోసారి హిందూపురం వరకూ పట్టుగూళ్లు తెచ్చిన రవాణా ఖర్చులు కూడా రావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వేచిచూస్తే కొంతమేలు..

పట్టుగూళ్ల అమ్మకాలకు ఆన్‌లైన్ ద్వారా టెండర్ వేసే ప్రక్రియ సాగుతోంది. అయితే ప్రతిసారి 1, 2 టెండర్లలో తక్కువ ధర లభిస్తోంది. అందువల్ల మూడో టెండర్ వరకు వేచి చూస్తేనే ధర కాస్త పెరుగుతుందని రైతులు చెబుతున్నారు. కొన్నిసార్లు మూడో టెండర్‌లోనూ మంచి ధర దక్కడం లేదంటున్నారు. పట్టుగూళ్లు నిల్వచేసే అవకాశం లేకపోవడంతో రీలర్లు ఏకమై ధర తగ్గిస్తున్నారని రైతులు వాపోతున్నారు.

ఆదుకోని ప్రభుత్వం..

మార్కెట్‌లో పట్టుగూళ్ల ధరలు హెచ్చుతగ్గులు ఉన్నప్పుడు తగు చర్యలు తీసుకుని ప్రభుత్వం పట్టురైతులను ఆదుకోవాల్సి ఉన్నా.. ఆ మేరకు చర్యలు తీసుకోవడం లేదు. బైవోల్టిన్ రకం పట్టుగూళ్ల ఉత్పత్తికి కిలోపై అదనంగా ఇచ్చే రూ.50 ప్రోత్సాహకాన్ని కూటమి ప్రభుత్వం ఇప్పటి వరకూ అందించలేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పట్టు రైతులకు అండగా నిలవాలని రైతులు కోరుతున్నారు.

ఈ నెలలో బైవోల్టిన్ పట్టుగూళ్ల ధరలు ఇలా..

తేదీ	కనిష్ట ధర (కేజీ)	గరిష్ట ధర (కేజీ)
13.06.25	రూ. 430	రూ. 643
14.06.25	రూ.405	రూ.626
15.06.25	రూ.398	రూ.610
16.06.25	రూ.344	రూ.562
17.06.25	రూ.333	రూ.545
18.06.25	రూ.271	రూ.562
19.06.25	రూ.450	రూ.593
20.06.25	రూ.343	రూ.641

కేజీపై రూ.150 వరకు ధర తగ్గింది



వారంలోనే కేజీ బైవోల్టిన్ పట్టుగూళ్లపై దాదాపు రూ.150 వరకు ధర తగ్గింది. ఇంతకు మునుపు కేజీ పట్టుగూళ్లు రూ.750 వరకు పలికాయి. ప్రస్తుతం రూ.600 కూడా ధర రావడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించడంతో పాటు పట్టు రైతులకు అండగా నిలవాలి.

– సోమ్‌కుమార్, మడకశిర

కనీస మద్దతు ధర ఇవ్వాలి



పట్టుగూళ్లకు ఆన్‌లైన్ ద్వారా ధర చాలా తక్కువగా నిర్ణయిస్తున్నారు. దీంతో మూడో టెండర్ వరకూ వేచి చూశాం. అయినా కేజీ బైవోల్టిన్ రూ.522 వరకే ధర పలికింది. నాణ్యమైన గూళ్లకు ఇంత తక్కువ రేటు నిర్ణయిస్తే రైతు ఏ విధంగా గట్టెక్కగలరు. కనీస మద్దతు ధర ఇవ్వాలి

– సత్యనారాయణ, సోమందేపల్లి

నాణ్యతబట్టే ధర



నాణ్యత ఆధారంగా పట్టుగూళ్లకు ధర ఉంటోంది. వాతావరణ పరిస్థితుల కారణంగా గూళ్ల నాణ్యత తగ్గి రేటుపై ప్రభావం చూపుతోంది. దిగుబడి పెరిగిన కారణంగా డిమాండ్ కొంత తగ్గింది. రీలర్లు ఎక్కువ మంది పాల్గొనేలా చేసి ధర పెంచేందుకు కృషి చేస్తాం.

– హంపయ్య, మార్కెట్ అధికారి, హిందూపురం

అక్రమ కేసులకు భయపడకండి



యువతపోరు పోస్టర్లు ఆవిష్కరిస్తున్న రమేష్‌రెడ్డి, బీఎస్ మక్బూల్, చాంద్‌బాషా, వజ్ర భాస్కర్‌రెడ్డి, పూల శ్రీనివాసరెడ్డి



సమావేశానికి హాజరైన నాయకులు, కార్యకర్తలు

- ప్రతి కార్యకర్తకూ పార్టీ అండగా ఉంటుంది
- వైఎస్సార్ సీపీ 'పురం' పార్లమెంట్ పరిశీలకుడు రమేష్‌కుమార్‌రెడ్డి
- జగనన్నతోనే సంక్షేమ రాజ్యం: బీఎస్ మక్బూల్

కదిరి టౌన్: ''కూటమి ప్రభుత్వం కక్ష సాధింపులో భాగంగా బనాయించే అక్రమ కేసులకు ఎవరూ భయపడాల్సిన పనిలేదు. ప్రతి కార్యకర్తకూ పార్టీ అండగా ఉంటుంది. కూటమి సర్కార్ వైఫల్యాలను ఎండగట్టండి..ప్రజలను చైతన్యవంతులను చేయండి..మళ్లీ వైఎస్ జగన్ సారథ్యంలో సంక్షేమ ప్రభుత్వం రాష్ట్రంలో ఏర్పాటయ్యేందుకు కార్యకర్తలంతా సైనికుల్లా పనిచేయండి'' అని వైఎస్సార్ సీపీ హిందూపురం పార్లమెంట్ పరిశీలకుడు రమేష్ కుమార్‌రెడ్డి అన్నారు. శనివారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు షేక్ బాబ్జాన్ అధ్యక్షతన జరిగిన టౌన్, మండల కమిటీల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ...కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో అరాచకాలు, దౌర్జన్యాలు పెరిగిపోయాయన్నారు. తమ అసమర్థతను కప్పిపుచ్చుకునేందుకు సీఎం చంద్రబాబు పోలీసులను వాడుకుంటున్నారన్నారు. ప్రశ్నించే వారిపై అక్రమ కేసులు బనాయిస్తూ వేధిస్తున్నారన్నారు. అయినా ఎవరూ భయపడాల్సిన పనిలేదన్నారు.

జగనన్నను మరోసారి సీఎంను చేసుకుందాం..

కార్యకర్తలంతా సమష్టిగా పనిచేసి మండల, గ్రామస్థాయిలో వైఎస్సార్ సీపీని మరింత బలోపేతం చేయాలని వైఎస్సార్ సీపీ కదిరి నియోజకవర్గ సమన్వయకర్త బీఎస్ మక్బూల్ అహ్మద్ పిలుపునిచ్చారు. తాను నిరంతరం అందుబాటులో ఉంటానని, ఎవరికి ఏ అవసరమున్నా తన దృష్టికి తీసుకురావాలన్నారు. అక్రమ కేసులతో వేధించే వారిని న్యాయస్థానం ఎదుట నిలబెట్టి తప్పక శిక్ష పడేలా చేస్తామన్నారు. వైఎస్ జగనన్నతోనే సంక్షేమ రాజ్యం సాధ్యమని, అందువల్లే ఆయన్ను రెండోసారి సీఎంగా చేసుకునేందుకు కార్యకర్తలంతా సైనికుల్లా పని చేయాలన్నారు. అనంతరం పార్టీ రాష్ట్ర కార్యదర్శి పూల శ్రీనివాసరెడ్డి, మాజీ ఎమ్మెల్యే అత్తార్ చాంద్‌బాషా, మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వజ్ర భాస్కర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి ప్రణీత్‌రెడ్డి మాట్లాడారు.

23న యువత పోరు..

యువత భవిష్యత్‌ను అంధకారం చేసిన కూటమి సర్కార్ తీరును నిరసిస్తూ ఈనెల 23వ తేదీన వైఎస్సార్ సీపీ 'యువత పోరు' కార్యక్రమం నిర్వహిస్తోందని రమేష్ కుమార్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో భాగంగా నిరుద్యోగులతో కలిసి అన్ని కలెక్టరేట్‌ల వద్ద నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. అందరూ పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. అనంతరం యువత పోరు పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ తోట అమర్‌నాథ్‌రెడ్డి, మండల కన్వీనర్లు మణికంఠ నాయక్, రవికుమార్‌రెడ్డి, రవీంద్రారెడ్డి, రంగారెడ్డి, ఫయాజ్, అశోక్‌కుమార్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, సర్పంచులు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యవంతమైన సమాజం

- యోగా దినోత్సవంలో కలెక్టర్ చేతన్, ఎస్పీ రత్న



యోగాంధ్ర పోటీల్లో గెలుపొందిన వారికి సర్టిఫికెట్లు, మెమొంటోలు ప్రదానం చేస్తున్న కలెక్టర్ టీఎస్ చేతన్ తదితరులు

హిందూపురం టౌన్: దైనందిన జీవితంలో ప్రతి ఒక్కరూ యోగాను భాగం చేసుకోవడం ద్వారా ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పడుతుందని కలెక్టర్ చేతన్ అన్నారు. 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం పట్టణంలోని ఎంజీఎం క్రీడామైదానంలో జిల్లా స్థాయి కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి కలెక్టర్ చేతన్‌తో పాటు ఎస్పీ రత్న, జేసీ అభిషేక్‌కుమార్, జిల్లా స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు యోగాసనాలు వేశారు. యోగా పోటీల్లో రాష్ట్ర, జిల్లా స్థాయిలో గెలుపొందిన వారికి సర్టిఫికెట్లు, మెమొంటోలను అందజేశారు. అనంతరం స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా మొక్కలను నాటారు. కార్యక్రమంలో పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మున్సిపల్ చైర్మన్ రమేష్, పెనుకొండ ఆర్డీఓ ఆనంద్ కుమార్, డీఎంహెచ్ఓ ఫైరోజా బేగం, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, పలువురు జిల్లా, మండల స్థాయి అధికారులు, విద్యార్థులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



హిందూపురం ఎంజీఎం కళాశాల మైదానంలో యోగాసనాలు వేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు

క్లుప్తంగా

‘యువత పోరు’తో ప్రభుత్వాన్ని నిలదీద్దాం



పోస్టర్లు విడుదల చేస్తున్న యువజన విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి లింగారెడ్డి తదితరులు

పుట్టపర్తి: ఇంటికో ఉద్యోగం లేదా నిరుద్యోగ భృతి నెలకు రూ.3వేల మంజూరు కోసం ఈ నెల 23న పుట్టపర్తిలో ‘యువత పోరు’ నిర్వహించనున్నారు. యువత భారీ ఎత్తున కార్యక్రమంలో పాల్గొని కూటమి ప్రభుత్వాన్ని నిలదీయాలని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు గంగుల సుధీర్‌రెడ్డి, విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు పురుషోత్తం రాయల్, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి లింగారెడ్డి, రాష్ట్రకార్యదర్శి అమర్‌నాథ్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం వారు పుట్టపర్తిలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ‘యువత పోరు’ పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా లింగారెడ్డి మాట్లాడుతూ చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం రాష్ట్రంలోని యువతకు చేసిన మోసాలను ఈ కార్యక్రమం ద్వారా ఎండగడదామన్నారు.

మహిళ ఆత్మహత్య

శెట్టూరు: అడవిగొల్లపల్లికి చెందిన రామాంజినమ్మ (45) జీవితంపై విరక్తితో ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. మూడేళ్ల వ్యవధిలో రామాంజినమ్మ భర్త, కుమారుడు మరణించారు. అప్పటి నుంచి ఒంటరిగా జీవనం సాగిస్తున్న రామాంజినమ్మకు అనారోగ్య సమస్యలు చుట్టుముట్టాయి. జీవితంపై విరక్తి చెందిన ఆమె శనివారం తెల్లవారుజామున ఇంట్లోనే ఉరివేసుకుంది. ఉదయం ఎంతసేపటికీ రామంజినమ్మ బయటకు రాకపోవడంతో చుట్టుపక్కల వారు ఇంటి తలుపులు తెరిచి చూడగా.. విగతజీవిగా కనిపించింది. వెంటనే కుమార్తె ఉమాదేవికి, పోలీసులకు గ్రామస్తులు సమాచారం చేరవేశారు. పోలీసులు కేసు నమోదు చేసి, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు.

మరోమారు దగా!

డీఎస్సీ–1998లో అర్హత సాధించి పోస్టింగులకు నోచుకోని వారు రెండు దశాబ్దాల తర్వాత మినిమం టైం స్కేల్ (ఎంటీఎస్) ప్రాతిపదికన ఉద్యోగాలు పొందారు. వారంతా 50 ఏళ్లకు పైబడిన వారే. ఇప్పుడు బదిలీల విషయంలో మరోమారు అన్యాయం జరుగుతోంది. రెగ్యులర్ ఉపాధ్యాయులకు సమీపంలోను, చుట్టుపక్కల ప్రాంతాల్లో స్థానాలు లభిస్తే.. ఎంటీఎస్ ఉపాధ్యాయులకు కర్ణాటక సరిహద్దున మండలాల్లో మాత్రమే ఖాళీలు చూపిస్తున్నారు. ఈ వయసులో అంతదూరం వెళ్లలేమని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం తమ పట్ల నిర్దయతో వ్యవహరిస్తోందని వాపోతున్నారు.

- ఎంటీఎస్ టీచర్లకు బదిలీల్లో తీరని అన్యాయం
- వైఎస్సార్‌సీపీ హయాంలో ఉద్యోగాలిచ్చారనే వివక్ష
- కర్ణాటక సరిహద్దు మండలాల్లో ఖాళీలు చూపుతున్నారు
- 50 ఏళ్లు పైబడిన వాళ్లం.. దూర ప్రాంతాలకు వెళ్లలేం
- కూటమి ప్రభుత్వం నిర్దయతో వ్యవహరిస్తోందని ఆవేదన
- అనంతపురం సైన్స్ మ్యూజియంలో నేడు బదిలీల కౌన్సెలింగ్



మడకశిర: ఉపాధ్యాయ పోస్టింగ్ నుంచి తదుపరి బదిలీల ప్రక్రియ వరకు డీఎస్సీ–1998 ఎంటీఎస్ ఉపాధ్యాయులు దగాకు గురవుతూనే ఉన్నారు. నాడు చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నపుడు ఎంతోమంది యువత ఉపాధ్యాయ కొలువుల కోసం డీఎస్సీ రాశారు. అర్హత సాధించిన వారిలో చాలామందికి స్థానాలు కేటాయించలేదు. దీంతో సదరు అభ్యర్థులు కోర్టుకెళ్లారు. వీరికి ఉద్యోగాలు ఇవ్వాలని కోర్టు ఆదేశించింది. ఎమ్మెల్సీలతో ఒక కమిటీ వేసి ఇందులో 75 మంది మాత్రమే అర్హులని తేల్చి.. మిగిలిన డీఎస్సీ అభ్యర్థులకు అన్యాయం చేశారు.

పాతికేళ్ల తర్వాత కొలువులు..

డీఎస్సీ–1998లో అన్యాయానికి గురైన 4,272 మంది అభ్యర్థులకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో న్యాయం జరిగింది. వారందరినీ మినిమం టైం స్కేల్ (ఎంటీఎస్) ప్రాతిపదికన నెలకు రూ.32,400 వేతనంతో ఉద్యోగాల్లోకి తీసుకుని, వారి కుటుంబాల్లో ఆనందం నింపారు. పాతికేళ్ల తర్వాత వారికి కొలువులు దక్కడం.. వారి వయసు 50 ఏళ్లకు చేరుకోవడంతో వీరందరికీ సొంత మండలాలు.. ఖాళీలు లేనిచోట పక్క మండలాల్లో పోస్టింగ్‌లు కేటాయించారు. అలా ఉమ్మడి అనంతపురం జిల్లాలో దాదాపు 520 మంది పనిచేస్తున్నారు.

మళ్లీ అదే కక్ష..

రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయ చట్టాన్ని తీసుకువచ్చి ఇటీవలనే ఉపాధ్యాయుల బదిలీ ప్రక్రియ నిర్వహించింది. అయితే ఈ బదిలీ ప్రక్రియలో ఎంటీఎస్ ఉపాధ్యాయులను చేర్చలేదు. ఎంటీఎస్ టీచర్లకు ప్రత్యేకంగా బదిలీ ప్రక్రియ నిర్వహించడానికి విద్యాశాఖ చర్యలు తీసుకుంటోంది. ఎంటీఎస్ టీచర్లు రెండేళ్ల నుంచి పని చేస్తున్న స్థానాలను కూడా ప్రభుత్వం ఖాళీలుగా చూపించింది. దీంతో ఆ స్థానాలన్నీ రెగ్యులర్ టీచర్లతో బదిలీ చేసేశారు. ఎంటీఎస్ టీచర్లకు మారుమూలన మండలాలకు బదిలీపై వెళ్లి పనిచేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ఖాళీలన్నీ సరిహద్దు మండలాల్లోనే..

ఉమ్మడి అనంతపురం జిల్లాలో రెగ్యులర్ టీచర్ల బదిలీలు నిర్వహించిన తర్వాత ఎక్కువగా ఖాళీలు కర్ణాటక సరిహద్దు మండలాల్లోనే విద్యాశాఖ అధికారులు చూపించినట్లు ఎంటీఎస్ టీచర్లు ఆరోపిస్తున్నారు. ఎంటీఎస్ టీచర్లకు బదిలీ ప్రక్రియ జరుగనుంది. వీరు ఈ బదిలీల్లో సరిహద్దు మండలాలకు వెళ్లి పని చేయాల్సి ఉంటుంది. శ్రీసత్యసాయి జిల్లాలో కర్ణాటక సరిహద్దులోని అమరాపురం మండలంలో 33, అగళి మండలంలో 20, గుడిబండ మండలంలో 50, రొళ్ల మండలంలో 50, మడకశిర మండలంలో 4 చొప్పున టీచర్ పోస్టులను ఖాళీగా చూపించారు. ఇక అనంతపురం జిల్లాలోని కర్ణాటక సరిహద్దు మండలాలైన డీ హీరేహాళ్, బొమ్మనహాళ్, కణేకల్లు, రాయదుర్గం, గుమ్మఘట్ట, బ్రహ్మసముద్రం మండలాల్లో ఎక్కువగా టీచర్ పోస్టులు ఖాళీలు చూపించారంటున్నారు. ఈనేపథ్యంలో ఎంటీఎస్ టీచర్లు బదిలీల ప్రక్రియలో ఈమండలాలను ఎంచుకోవాల్సి ఉంటుంది.

నేడు బదిలీల కౌన్సెలింగ్

ఎంటీఎస్‌పై పనిచేస్తున్న డీఎస్సీ–2008తో పాటు 1998 ఉపాధ్యాయులకు ఆదివారం ఉదయం తొమ్మిది గంటలకు అనంతపురంలోని జిల్లా సైన్సు మ్యూజియంలో బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. సంబంధిత ఉపాధ్యాయులు తప్పనిసరిగా కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని జిల్లా విద్యా శాఖ అధికారి ఒక ప్రకటనలో తెలిపారు.

వయసు రీత్యా ఎంటీఎస్ టీచర్లు దూర ప్రాంతంలోని మండలాలకు వెళ్లి విధులు నిర్వహించడం ఇబ్బందికరంగా ఉంటుందని భావిస్తున్నారు. అంతేకాకుండా వీరికి రూ.32,400 మాత్రమే నెలకు వేతనం అందుతుంది. ఈనేపథ్యంలో కూటమి ప్రభుత్వం తీసుకున్న ఈనిర్ణయం ఎంటీఎస్ టీచర్లకు శాపంగా మారింది.

పొమ్మనలేక పొగబెడుతున్న కూటమి ప్రభుత్వం..

కూటమి ప్రభుత్వం తమకు పొమ్మనలేక పొగబెడుతోందని ఎంటీఎస్ టీచర్లు వాపోతున్నారు. దూర ప్రాంతాలకు బదిలీ చేస్తే ఉద్యోగాలు వదిలేస్తారని కూటమి ప్రభుత్వం భావిస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వైఎస్‌జగన్ తమకు ఉద్యోగాలిచ్చారనే కక్షతోనే కూటమి ప్రభుత్వం తమ పట్ల కక్ష పూరితంగా వ్యవహరిస్తోందని ఆరోపిస్తున్నారు. ఇదిలా ఉండగా ఎంటీఎస్ టీచర్లకు ఇంతలా అన్యాయం జరుగుతున్నా ఉపాధ్యాయ సంఘాలు నోరెత్తకపోవడం పట్ల వారు నిరసన వ్యక్తం చేస్తున్నారు. తమను కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుని రెగ్యులర్ చేయాలని ఎంటీఎస్ టీచర్లు కోరుతున్నారు. బదిలీ కౌన్సెలింగ్‌లో తమను దూర ప్రాంతాలకు వేయకుండా సొంత మండలం లేదా పక్క మండలాన్ని కేటాయించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఇలాంటి పరిస్థితిలో ఎంటీఎస్ టీచర్లకు ప్రభుత్వం ఏ మేరకు న్యాయం చేస్తుందో వేచి చూడాలి.

జర్నలిస్టు పిల్లలకు ‘ప్రైవేట్’లో 50 శాతం ఫీజు రాయితీ

- ఎంఈఓలకు ఆదేశాలిచ్చిన డీఈఓ

పుట్టపర్తి: జిల్లాలో ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థల్లో జర్నలిస్టు పిల్లలకు ఫీజులో 50 శాతం రాయితీ ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని ఎంఈఓలకు ఆదేశాలిచ్చినట్లు డీఈఓ క్రిష్టప్ప శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. తమ పిల్లలకు ఫీజు రాయితీ ఇచ్చేలా ఆదేశాలు జారీ చేయాలని కలెక్టర్ టీఎస్ చేతన్‌కు గతంలో జర్నలిస్టులు వినతి పత్రం సమర్పించిన విషయం తెలిసిందే. కలెక్టర్ సూచన మేరకు డీఈఓ ఫీజు రాయితీ అమలుకు ఉత్తర్వులు జారీ చేశారు.

ఎస్‌ఆర్‌ఐటీలో ఉద్యోగాల పంట



ఎస్‌ఆర్‌ఐటీ కరస్పాండెంట్ ఆలూరు సాంబ శివారెడ్డితో ఉద్యోగాలు దక్కిన విద్యార్థులు

- 400 మంది విద్యార్థులకు క్యాంపస్ కొలువులు
- టీసీఎస్‌కు 157, కాగ్నిజెంట్‌కు 98 మంది ఎంపిక

అనంతపురం: బుక్కరాయసముద్రం మండలం రోటరీపురం వద్దనున్న శ్రీనివాస రామానుజన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎస్‌ఆర్‌ఐటీ) కళాశాలలో 400 మంది విద్యార్థులు క్యాంపస్ ఇంటర్వ్యూల్లో కొలువులు సాధించారు. ప్రముఖ బహుళజాతి సంస్థలు అయిన టీసీఎస్, కాగ్నిజెంట్, ఇన్ఫోసిస్, హెచ్‌సీఎల్ టెక్నాలజీ తదితర వాటిల్లో కొలువులు దక్కించుకున్నారు. ఏకంగా రూ.4 లక్షల నుంచి రూ.6.75 లక్షల వార్షిక వేతనం పొందనున్నారు. కాగ్నిజెంట్ కంపెనీలో 98 మంది, టీసీఎస్‌లో 157, ఇన్ఫోసిస్‌లో 21, హెచ్‌సీఎల్ టెక్‌లో 16, క్యాడ్‌మెస్ వైఎస్, లూమిన్, ప్లేటో, ఫాక్స్‌కాన్, ఐఆర్‌ఎంఏఐ కంపెనీల్లో 118 మందికి ఉద్యోగాలు వరించాయి. క్యాంపస్ కొలువులు అత్యధికంగా సాధించిన కళాశాలగా ఉమ్మడి అనంతపురం జిల్లాలోనే ఎస్‌ఆర్ఐటీ అగ్రస్థానంలో ఉండడం విశేషం. ఈ నెల 26న కంపెనీల్లో ఉద్యోగాలకు చేరనున్నారు. ఈ మేరకు ఆఫర్ లెటర్లు సైతం ఆయా కంపెనీలు ఇచ్చాయి. ఈ సందర్భంగా శనివారం ఆ విద్యార్థులను కళాశాల యాజమాన్యం, అధ్యాపకబృందం అభినందించింది. కార్యక్రమంలో ఇండస్ట్రీ రిలేషన్స్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ ఎం.రంజిత్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బాలకృష్ణ పాల్గొన్నారు

కళాశాలకు, కంపెనీకి అనుసంధానం

విద్యార్థుల శ్రమకు, అధ్యాపకుల మార్గదర్శనానికి నిదర్శనమే ఈ ఫలితాలు. కళాశాలకు, కంపెనీకి అనుసంధానంతోనే సంచలన ఫలితాలు సాధ్యమయ్యాయి. సాఫ్ట్‌వేర్ కొలువులు పొందాలంటే ఎస్‌ఆర్‌ఐటీకే సాధ్యమని నిరూపించాం. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా తర్ఫీదు ఇస్తున్నాం. మంచి కంపెనీల్లో కొలువులు దక్కిన విద్యార్థులందరికీ అభినందనలు.

– ఆలూరు సాంబశివారెడ్డి, కరస్పాండెంట్, ఎస్‌ఆర్‌ఐటీ

‘సిద్ధార్థ’లో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే



యువ ఇంజినీర్‌కు గోల్డ్ మెడల్ అందజేస్తున్న వీసీ సుదర్శనరావు, అశోకరాజు

నారాయణవనం: పుత్తూరు సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం గ్రాడ్యుయేషన్ డే ఘనంగా నిర్వహించారు. అనంతపురం జేఎన్‌టీయూ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ సుదర్శనరావు, వోల్వా గ్రూప్ రిటైర్డ్ డైరెక్టర్ ఇందు శేఖర్ ముఖ్య అతిథులుగా పాల్గొని పాస్ అవుట్ ఇంజినీరింగ్ విద్యార్థులకు మెడల్స్, పట్టాలు అందజేశారు. అనంతరం ఆడిటోరియంలో జరిగిన కాన్వొకేషన్ డే సమావేశంలో కళాశాలల చైర్మన్ డాక్టర్ అశోకరాజు మాట్లాడుతూ గ్రామీణ విద్యార్థులకు మెరుగైన సాంకేతిక విద్య అందించడానికి సిద్ధార్థ గ్రూప్ కళాశాలలు కృషి చేస్తున్నట్టు తెలిపారు. ప్రపంచస్థాయి ల్యాబ్, డిజిటల్ లైబ్రరీ, ఇంక్యుబేషన్ సెంటర్లను అభివృద్ధి చేశామన్నారు. విద్యా ప్రమాణాలు, నాణ్యతలో రాజీ పడకుండా విద్యనందిస్తున్నామని పేర్కొన్నారు. వైస్ చాన్స్‌లర్ సుదర్శనరావు మాట్లాడుతూ తోటి వారితో పోటీ పడి సృజనాత్మక, ఇన్నొవేటివ్ విద్యపై శ్రద్ధ చూపాలన్నారు. యువ ఇంజినీర్లు నిరంతరం పరిశోధనలపై దృష్టి సారించాలన్నారు. సిద్ధార్థ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ టెక్నాలజీ కళాశాలలో ఉత్తీర్ణత పొందిన 903 మంది, సిద్ధార్థ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాలలో ఉత్తీర్ణత పొందిన 485 మందికి డిగ్రీ కాన్వొకేషన్లు అందజేశారు. 2024–25లో విద్యా సంవత్సరానికి సంబంధించి 17 మంది విద్యార్థులకు గోల్డ్ మెడళ్లు, ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో యూనివర్సిటీ నామినీస్ ప్రశాంతి, అరుణక్రాంతి, ప్రిన్సిపాల్ మధు, జనార్దనరాజు, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినర్ విజయభాస్కర్, గోపి, హెచ్‌ఓడీలు, అధ్యాపకులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

బాలింతలతో ‘వసూళ్లు’



గూగుల్ పే ద్వారా అపరిచిత వ్యక్తికి డబ్బు పంపించామని చెబుతున్న బాలింత కౌసర్, తమ్ముడు సాదిక్

అనంతపురం మెడికల్: ప్రభుత్వాస్పత్రిలో ప్రసవమైన వారికి ఆర్థికసాయం ఇప్పిస్తామని అగంతకులు బాలింతల నుంచి వసూళ్లకు పాల్పడుతున్నారు. తాజాగా ఇలాంటి ఘటన ఒకటి శనివారం వెలుగు చూసింది. అనంతపురం నగర శివారులోని ఆలమూరు రోడ్డులో ఉంటున్న కౌసర్ ఇటీవల ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో చేరింది. ఈ నెల 17న ఆడబిడ్డకు జన్మనిచ్చింది. మరుసటి రోజు వీరికి ఓ వ్యక్తి ఫోన్ చేశాడు. ఆమె ఆధార్, కుటుంబ వివరాలు తెలియజేసి.. రూ.1000 ఇస్తే, ఎన్టీఆర్ వైద్య సేవ కింద డబ్బులు మంజూరు చేయిస్తామని చెప్పాడు. దీంతో కౌసర్ నిజమని నమ్మి గూగుల్ పే నుంచి రూ.వెయ్యి పంపారు. అనంతరం డబ్బు వసూలు గురించి డేటా ఎంట్రీ ఆపరేటర్ల దృష్టికి వెళ్లడంతో వారు సూపరింటెండెంట్ డాక్టర్ ఆత్మారాంకు ఫిర్యాదు చేశారు. ఇది ఎవరో గుర్తు తెలియని వ్యక్తి చేసిన పని అని ఆస్పత్రి వర్గాలు నిర్ధారణకు వచ్చాయి. అయితే సదరు అపరిచిత వ్యక్తికి తిరిగి ఫోన్ చేస్తే రిసీవ్ చేసుకోవడం లేదని తెలిసింది. ప్రభుత్వం నుంచి అందే ఆర్థికసాయం తదితర సేవల గురించి అవగాహన కల్పించడంలో వైద్యులు, అధికారులు నిర్లక్ష్యం వహించడం వల్లే ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

వివాహిత అనుమానాస్పద మృతి



మృతురాలు రాజేశ్వరి

పామిడి: వివాహిత అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన పామిడిలో కలకలం సృష్టించింది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. స్థానిక ఫారెస్ట్ బంగ్లా వద్ద నివాసం ఉంటున్న ఈశ్వర్‌రెడ్డి, రాజేశ్వరి (28) దంపతులు. వీరికి కుమార్తె భవ్యశ్రీ, కుమారుడు మూర్తీశ్వర్‌రెడ్డి సంతానం. ఈశ్వర్‌రెడ్డి కువైట్‌లో పనిచేస్తూ వీరిని పోషిస్తున్నాడు. రాజేశ్వరి స్థానిక నాగిరెడ్డి కాలనీకి చెందిన ఆటో డ్రైవర్ ఉప్పర భాస్కర్‌తో వివాహేతర సంబంధం ఉంది. ఈ విషయం బయట పడిన తర్వాత ఇరువర్గాల మధ్య పంచాయితీలు జరిగాయి. పోలీస్ స్టేషన్ వరకు వెళ్లినా వారిలో మార్పు రాలేదు. యథావిధిగా వివాహేతర సంబంధం కొనసాగిస్తూనే వస్తున్నారు. ఈ క్రమంలో ఇటీవలే కువైట్ నుంచి వచ్చిన భర్త శుక్రవారం రాత్రి తిరిగి విధి నిర్వహణ నిమిత్తం వెళ్లిపోయాడు. సమాచారం తెలుసుకున్న భాస్కర్ శనివారం రాజేశ్వరిని ఆటోలో ఎక్కించుకుని వంకరాజుకాలువ గ్రామానికి వెళ్లే దారిలోని మోరీ వద్దకు తీసుకెళ్లాడు. అక్కడ వారిమధ్య ఏమి జరిగిందో తెలియదు కానీ... రాజేశ్వరి రక్తగాయాలతో పడి ఉంది. దీన్ని అటుగా వచ్చిన వారు గమనించి భాస్కర్‌ను ప్రశ్నిస్తే.. రాజేశ్వరి తన భార్య అని, ఫిట్స్ వచ్చి పడిపోయిందని వారిని నమ్మించాడు. అనంతరం ఆటోలో ఆమెను పామిడి కమ్యూనిటీ ఆస్పత్రికి తెచ్చాడు. అక్కడి నుంచి నేరుగా పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయాడు. విషయం తెలుసుకున్న గుత్తి సీఐ వెంకటేశ్వర్లు హుటాహుటినా పామిడి పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. రాజేశ్వరి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని మార్చురీకి తరలించి కేసు నమోదు చేశారు.

ఆటో డ్రైవరే హత్య చేశాడు: తమ కుమార్తె రాజేశ్వరిని ఆటో డ్రైవర్ ఉప్పర భాస్కర్ హత్య చేశాడని తల్లిదండ్రులు రామకృష్ణారెడ్డి, మాధవి ఆరోపించారు. బంధువులతో కలిసివారు పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నా చేశారు. హంతకుడుని కఠినంగా శిక్షించి, న్యాయం చేయాలని నినాదాలు చేశారు.

డెంగీ జ్వరాల కలకలం



చికిత్స పొందుతున్న సాయి

బత్తలపల్లి: డెంగీ జ్వరాలు కలకలం రేపుతున్నాయి. బత్తలపల్లిలోని విద్యాధరి పాఠశాల సమీపంలో గల వీరనారప్ప కుమారుడు సాయి మూడు రోజులుగా డెంగీ జ్వరంతో బాధపడుతూ ఆర్డీటీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. వర్షాకాలం ప్రారంభమవడంతో సీజన్ వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉన్నా వైద్య ఆరోగ్య సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. ఆర్డీటీ ఆస్పత్రిలో బత్తలపల్లి, తాడిమర్రి మండలాలకు చెందిన చిన్నారులు డెంగీ జ్వరాలతో చికిత్స పొందుతున్నారు. ఇప్పటికైనా వైద్య ఆరోగ్య సిబ్బంది గ్రామాల్లో పర్యటించి ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఉపాధ్యాయుడు అదృశ్యం



ఆసిఫ్ మహమ్మద్ (ఫైల్)

కదిరి టౌన్: మున్సిపల్ ప్రైమరీ స్కూల్ ఉపాధ్యాయుడు షేక్ ఆసిఫ్ మహమ్మద్ అదృశ్యమయ్యాడు. ఈయన పట్టణంలోని మారుతీనగర్‌లో నివాసముంటున్నారు. ఈయన ఇతరుల వద్ద రూ.50 లక్షల మేర అప్పులు చేసి, వారికి తిరిగి చెల్లించలేక ఇబ్బందులు పడుతుండటం గమనించిన భార్య పటాన్ జిగిని ఎందు కోసం చేశావని నిలదీసింది. దీంతో శుక్రవారం ఇంటి నుంచి బయల్దేరిన షేక్ ఆసిఫ్ మహమ్మద్ స్కూలుకు వెళ్లలేదు. ఎక్కడికి వెళ్లాడో తెలియలేదు. చుట్టుపక్కల, స్నేహితుల వద్ద విచారించినా ఆచూకీ లభించకపోవడంతో భార్య శనివారం పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసినట్లు సీఐ వి.నారాయణరెడ్డి తెలిపారు.

ప్రైవేట్ టీచర్ దుర్మరణం



మృతి చెందిన అరుణ శ్రీ

ముదిగుబ్బ: జొన్నలకొత్తపల్లి వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బుక్కపట్నం మండలం మారాల గ్రామానికి చెందిన అరుణశ్రీ (36) అనే ప్రైవేటు స్కూలు టీచర్ దుర్మరణం చెందింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు... బుక్కపట్నం మండలం కృష్ణాపురం చర్చికి చెందిన కొందరు మహిళలు శనివారం బొలెరో వాహనంలో అనంతపురం వైపు బయల్దేరారు. జొన్నలకొత్తపల్లి వద్దకు రాగానే టైరు బరెస్టవడంతో వాహనం అదుపుతప్పి రోడ్డు పక్కన పొలాల్లోకి దూసుకెళ్లి పల్టీలు కొట్టింది. ఈ ఘటనలో కృష్ణాపురం లయోల పాఠశాల టీచర్ అరుణశ్రీ అక్కడికక్కడే మృతి చెందింది. మరో ఎనిమిది మంది అణ్ణమ్మ, సుజాత, నూనె జీవన, మండల అనూష, ఎడిత్యా శ్రావణి, చింతమొక్కల లావణ్య, కీర్తన శ్రావణి గాయపడ్డారు. క్షతగాత్రులను 108 వాహనంలో బత్తలపల్లి ఆర్డీటీ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు విచారణ చేస్తున్నారు.

గిన్నిస్ రికార్డు కోసం.. గిరిజన పిల్లలకు కష్టాలు

హిందూపురం టౌన్: గిన్నిస్ రికార్డు కోసం ఎన్డీఏ ప్రభుత్వం గిరిజన విద్యార్థులను విశాఖపట్నం తరలించి, సౌకర్యాలు కల్పించడంలో విఫలమై కష్టాలపాలు చేసిందని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు బాబావలి, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు నరసింహమూర్తి ధ్వజమెత్తారు. శనివారం వారు మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తన గొప్పల కోసం, మోడీ మెప్పు కోసం, మరీ ముఖ్యంగా గిన్నిస్ రికార్డు కోసం వేలాదిమంది గిరిజన విద్యార్థులను ఇబ్బందులకు గురి చేసిందని మండిపడ్డారు. అర్ధరాత్రి వేళ బస్సులో తరలించడం.. నిద్రించడానికి సరైన సదుపాయాలు కల్పించకపోవడం దారుణమన్నారు. ఎమ్మెల్యేలు, మంత్రులు, అధికారుల పిల్లలను ఈ విధంగా తరలిస్తారా అని కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.

మహిళా సర్పంచులకు రేపటి నుంచి శిక్షణ

అనంతపురం సిటీ: రాష్ట్ర గ్రామ స్వరాజ్య అభియాన్ (ఆర్‌జీఎస్‌ఏ) కింద ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మహిళా సర్పంచులకు సోమవారం నుంచి మూడు రోజులపాటు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు సీఈఓ శివశంకర్ శనివారం తెలిపారు. ‘స్థానిక పాలనలో మహిళా సాధికారత’ అనే అంశంపై డివిజనల్ స్థాయిలో శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు వివరించారు. జిల్లాలో మూడు డివిజన్లలో శిక్షణ తరగతులు కొనసాగుతాయని తెలిపారు. అనంతపురం డివిజన్‌కు సంబంధించి స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయ క్యాంపస్‌లోని జిల్లా పంచాయతీ వనరుల కేంద్రం(డీపీఆర్‌సీ)లో, గుంతకల్లు డివిజన్ వారికి గుత్తి మండల పరిషత్ కార్యాలయంలో, కళ్యాణదుర్గం డివిజన్ వారికి స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శిక్షణ తరగతులకు ఏర్పాట్లు చేసినట్లు సీఈఓ వెల్లడించారు.